● హర్ ఘర్ తిరంగా



బీచ్‌రోడ్‌లో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పాల్గొని, భవిష్యత్ తరాల్లో దేశభక్తిని, స్వాతంత్ర్య స్ఫూర్తిని పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బైక్ ర్యాలీ, వస్తు ప్రదర్శన, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

## వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు జిల్లాలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండి, తేలికపాటి వర్షం పడే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం తెలిపారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 35.0 నుంచి 35.4 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 26.3 నుంచి 27.0 డిగ్రీలు నమోదు కావచ్చన్నారు.

## న్యూస్‌రీల్

### నేడు ఎస్.రాయవరం ఎంపీపీ ఎన్నిక

**ఎస్.రాయవరం :** మండల పరిషత్ అధ్యక్ష పదవికి బుధవారం ఎన్నిక నిర్వహించనున్నట్టు ఎన్నికల అధికారి మనోరమ తెలిపారు. ఇటీవల ఎంపీపీ పదవికి రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యం అయ్యింది. గత నెలలో నిర్వహించిన ఎన్నికకు సభ్యులు హాజరు కాకపోవడంతో ఇన్‌చార్జ్ ఎంపీపీగా బొలిశెట్టి గోవిందరావు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు మరోమారు రాష్ట్ర అధికారి ఎన్నిక నోటిఫికేషన్ విడుదల చేసినట్టు తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట మధ్యలో ఎన్నిక జరుగుతుంది. మండలంలో ఎంపీపీ ఎన్నికకు మెజార్టీ సభ్యులు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు ఉండడంతో టీడీపీ వారు కలుగ జేసుకోలేదు. అయితే ఇటీవల మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పదవి బొలిశెట్టి గోవిందరావు రాజీనామా చేయడంతో ఎంపీపీ ఎన్నికకు కాస్త పోటీ వాతావరణం పెరిగింది. గోవిందరావు రాజీనామాతో ఎంపీటీసీ సభ్యులు రెండుగా విడిపోయారు. పార్టీకి వ్యతిరేకంగా ఎంతమంది ఎంపీటీసీలు ఓటు చేస్తారనేది బుధవారం ఎన్నికలో తేలనుంది.

### జాతీయ హాకీ పోటీలకు ఎంపిక



రాష్ట్ర హాకీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

**యలమంచిలి రూరల్ :** జాతీయ జూనియర్ మెన్స్ హాకీ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్టు హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొఠారు నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు.యలమంచిలికి చెందిన వై దుర్గాప్రసాద్, దొడ్డి నిరంజన్, నక్కపల్లికి చెందిన అనిల్ కుమార్‌లు రాష్ట్ర జట్టులో చోటు పొందారని, వీరు ఈ నెల 12వ తేదీ నుంచి పంజాబ్‌లోని జలంధర్‌లో జరుగుతున్న జాతీయ హాకీ పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరికి పలువురు క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

# బదిలీలు సరే... జీతాలెప్పుడో..!

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కాలంలోనే ప్రభుత్వ ఉద్యోగుల ఆగ్రహం చవిచూస్తోంది. ఇటీవల రెండు నెలల క్రితం ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికన జరిగిన సాధారణ బదిలీల్లో స్థాన చలనమైన ఉపాధ్యాయులు, రెవెన్యూ ఉద్యోగులకు కూటమి సర్కార్ జీతాల విషయంలో చుక్కలు చూపిస్తోంది. బదిలీల ప్రక్రియ ముగిసి విధుల్లో చేరి రెండు నెలలు పూర్తయి.. మూడో నెల కూడా సగమైంది. జీతాలు మాత్రం చెల్లించకుండా ప్రభుత్వం అవస్థలపాలు చేస్తోంది.

- టీచర్లు, రెవెన్యూ ఉద్యోగులకు అందని వేతనాలు
- టీచర్లకు ఐడీ కేటాయింపుల్లో జాప్యం
- రెండు నెలలుగా జీతాల్లేవు.. మూడో నెలా అదే పరిస్థితి
- జిల్లాలో 3 వేలకు పైగా రెవెన్యూ ఉద్యోగులు, టీచర్లు, సిబ్బంది ఎదురుచూపులు

**ఉమ్మడి జిల్లాలో బదిలీల వివరాలు ఇలా...**

| విద్యాశాఖలో టీచర్ల బదిలీ | రెవెన్యూ శాఖలో |
|---|---|
| 3000 | 1500 |
| వివిధ శాఖల్లో 500 | |




**సాక్షి, అనకాపల్లి :** జూన్ నెలలో జీతం రాలేదు.. జులైలో జీతం రాలేదు. ఆగస్టు నెల అయినా జీతం వస్తుందా..అని వేలాది మంది టీచర్లు, రెవెన్యూ ఉద్యోగులు సిబ్బంది ఎదురు చూపులు చూస్తున్నారు? బదిలీలను సాకుగా చూపి ప్రభుత్వం జీతాలను చెల్లించకుండా కాలయాపన చేస్తోందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి సర్కార్ నిర్లక్ష్యంతో పాటు విద్యా, ట్రెజరీ శాఖల సమన్వయ లోపంతోనే ఉపాధ్యాయులకు ఈ పరిస్థితి దాపురించింది. తమ జీతాల చెల్లింపు విషయంలో ప్రభుత్వం, అధికారులు ఆలసత్వం ప్రదర్శిస్తున్నారని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి.

**బదిలీలు పూర్తయినా..సమస్యలు అలాగే...**

సాధరణ బదిలీల్లో ఉపాధ్యాయులు, రెవెన్యూ ఉద్యోగులకు భారీగా బదిలీలు జరిగాయి. రెవెన్యూలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంటు, వీఆర్వోలకు బదిలీలు జరిగాయి. ఈ బదిలీలు ప్రక్రియ పూర్తయినా..అక్కడక్కడా డిప్యూటేషన్ సమస్యలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. నిషేధం ఎత్తి వేసిన తర్వాత కూడా బదిలీలను జిల్లా కలెక్టర్ కొనసాగిస్తున్నారు. ప్రతి ఉద్యోగికి జూన్, జులై, ఆగస్టు మాసాల్లో ఖర్చులు చాలా అధికంగా ఉంటాయి. విద్యా సంవత్సరం ప్రారంభంలో పిల్లల స్కూలు ఫీజులు, ఇతర విద్యా సామాగ్రి కోసం వేల రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే బదిలీలు జరిగే ప్రాంతానికి వెళ్లేందుకు రవాణా ఖర్చులు, కొత్త ఇంటి అడ్వాన్సులు, ఇంటి అద్దెల రూపంలో మరింత ఖర్చు పెరుగుతుంది. వీటన్నింటికి తోడు జీతాలు సకాలంలో రాకపోవడంతో నెలసరి ఈఎంఐల చెక్కు బౌన్సులు, పర్సనల్ లోన్స్, హౌసింగ్ లోన్ వంటి చెక్ బౌన్సులు అవుతున్నాయని ఉద్యోగులు వాపోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల కారణంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు పరిస్థితి ఇంత దారుణంగా ఉంది. ఉపాధ్యాయుల బదిలీలు జూన్ 15వ తేదీ నాటికి అన్ని పూర్తయ్యాయి. అయితే ఇప్పటికీ అనేక మంది ఉపాధ్యాయులకు పోజిషన్ ఐడీలు కేటాయించలేదని తెలుస్తోంది. దీంతో జూన్ నెలకు సంబంధించిన జులై నెల జీతాలు ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు అందలేదు. అలాగే జులై నెలకు సంబంధించిన జీతాలు ఆగస్టు మొదటి వారంలో అందుకునే అవకాశం లేదని తెలుస్తోంది.

### త్వరితగతిన జీతాలు వేయాలి



బదిలీ అయిన ఉపాధ్యాయులు, రెవెన్యూ ఉద్యోగులు సొంత ప్రాంతం నుంచి వారి కుటుంబాలతో వెళ్లారు. రవాణా ఖర్చులు, ఇంటి అద్దె, అడ్వాన్స్ రూపంలో ఎక్కువగా ఖర్చు పెట్టారు. మరోవైపు జూన్ నెలల్లోనే బదిలీలు అవ్వడంతో కావడంతో పిల్లల స్కూలు ఫీజు, విద్యార్థులకు పుస్తకాలు, ఇతర ఖర్చులు ఎక్కువయ్యాయి. ఈ పరిస్థితుల్లో జీతాలు అందకపోవడంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు చొరవ చూపించి త్వరితగతిన జీతాలు వచ్చేలా చేయాలని కోరుతున్నాను.

– టి.ఆర్.అంబేద్కర్, యూటీఎఫ్ జిల్లా సెక్రెటరీ

# పరిశ్రమలలో ప్రమాదాల నివారణకు ప్రణాళిక

- సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెరగాలి
- జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా
- అచ్యుతాపురం పోలీస్‌స్టేషన్ సందర్శన



అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

**అచ్యుతాపురం : పరిశ్రమల జరిగే** ప్రమాదాల **నివారణకు తగిన ప్రణాళికలు కలిగి** ఉండాలని **జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు.** అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌ను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా మాట్లాడారు. ప్రమాదం జరిగితే స్పందించాల్సిన విధానంపై తగిన సూచనలు ఇస్తున్నామని తెలిపారు. ప్రమాదాల నివారణకు సేఫ్టీ ట్రైనింగ్ ఇస్తున్నామని, దీనిపై తగిన పర్యవేక్షణ కలిగి ఉన్నామని అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాల వద్ద గట్టి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా ప్రదేశాల వద్ద నిబంధనలు కచ్చితంగా పాటించాలని సిబ్బందికి సూచించారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు, అతి వేగ నివారణ, హెల్మెట్ వినియోగం నిరంతర ప్రచార, అమలు జరిగే చూడాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని,ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టం ద్వారా తనిఖీలు చేయాలని సూచించారు. పెండింగ్ ఫైల్స్ సీడీల పరిశీలన, కేసుల పురోగతిపై సూచనలు ఇచ్చారు. నేరాలు అరికట్టేందుకు గస్తీ ముమ్మరం చేయాలని అన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్మూలనకు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని పేర్కొన్నారు. గంజాయి రవాణా, నాటు సారా తయారీపై ఎప్పటికప్పుడు దాడులు చేయాలన్నారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్న ఈ అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. శాంతి భద్రతలు కాపాడేందుకు రౌడీ షీటర్లపై నిఘా, చెడు ప్రవర్తన కలిగిన వారి పట్ల ప్రత్యేక దృష్టి ఉంచాలని అన్నారు. సీసీటీవీల ఏర్పాటుపై ఆసక్తి, ప్రోత్సాహం కల్పించాలని పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. సీఐ గణేశ్,ఎస్ఐలు సుధాకర్,వెంకటరావు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి

- జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్
- లింగరాజుపాలెం హైస్కూల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్న జిల్లా కలెక్టర్

**ఎస్.రాయవరం :** విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే మంచి ఫలితాలు వస్తాయని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. జాతీయ నులిపురుగులు దినోత్సవం పురస్కరించుకుని లింగరాజుపాలెం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. విద్యార్థులకు నులిపురుగులు మాత్రలు పంపిణీ చేసి వారితో ముచ్చటించారు. విద్యార్థులకు చదువుతో పాటు పరిశుభ్రతపై కూడా అవగాహన కల్పించాలని చెప్పారు. చేతి గోళ్లు కత్తిరించి శుభ్రంగా ఉంచుకునేలా చేయాలన్నారు. పాఠశాలల్లో పరిశుభ్రమైన తాగునీటిని అందించడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. మరుగుదొడ్డి వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలతో పాటు విద్యాలక్ష్యాలను కూడా వివరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి హైమావతి, డీఈవో అప్పారావు, సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి వాసంతి పాల్గొన్నారు.

# వరుణ కటాక్షం...జల 'తాండవ'ం



నాతవరంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



తాండవలో పెరుగుతున్న నీటి మట్టం

**నాతవరం :** తాండవ రిజర్వాయరుకు సంబంధించి ఈ ప్రాంతంలో గత యాభై ఏళ్లుగా వస్తున్న సంప్రదాయాన్ని, ప్రజల నమ్మకాన్ని ఈ ఏడాది కూడా మరోసారి ప్రకృతి అక్షరాలా నిజం చేసింది. మండలంలో తాండవ రిజర్వాయరు నిర్మించాక మొట్టమొదటిసారి ప్రాజెక్టు ప్రధాన గేట్లు ఎత్తి ఆయకట్టుకు నీటిని 1974లో కాలువ ద్వారా విడుదల చేశారు. తాండవ ప్రాజెక్టు గేట్లు ఎత్తిన రోజు తర్వాత కూడా ఈ ప్రాంతంలో వర్షం పడుతుంది. ఈ ఆనవాయితీ సుమారుగా 50 ఏళ్లుగా కొనసాగుతూ వస్తుందని ఈ ప్రాంతీయులు అంటున్నారు. తాండవ రిజర్వాయరులో నీటి మట్టం తక్కువగా ఉన్న సమయంలో కూడా ఖరీఫ్ సాగుకు నీటిని విడుదల చేస్తే కచ్చితంగా వర్షం పడుతుంది. ఈఏడాది ఖరీఫ్ పంటసాగుకు నీరు విడుదల చేయగా ఆ రోజు నుంచి మండలంలో ఏదో ఒక ప్రాంతంలో వర్షం పడుతోంది. తాండవ ప్రాజెక్టు నుంచి నీటిని ఆదివారం విడుదల చేసే సమయంలో 371.5 అడుగులు నీరు ఉండేది. ఇటీవల కురిసిన వర్షానికి ఇన్ ఫ్లో నీరు ప్రాజెక్టులోకి రావడంతో మంగళవారం సాయంత్రానికి 372.5 అడుగుల కు పెరిగిందని ప్రాజెక్టు జేఈ శ్యామ్‌కుమార్ తెలిపారు.

# జల ప్రవాహంలో బిక్కుబిక్కుమని..

- సరియా వద్ద చిక్కుకున్న 32 మంది పర్యాటకులు
- భారీ వర్షానికి జలపాతం దారిలో గెడ్డ ఉధృతి
- గెడ్డ ఆవల చిక్కుకుపోయిన సందర్శకులు
- అప్రమత్తం చేసిన అనకాపల్లి ఎస్పీ
- రోప్ సహాయంతో రక్షించిన పోలీసు, ఫైర్, రెవెన్యూ సిబ్బంది



సరియా జలపాతం వద్ద రోప్ సహాయంతో పర్యాటకులను గెడ్డ దాటిస్తున్న అధికారులు



సురక్షితంగా బయటకు తీసుకువచ్చిన పర్యాటకులతో అనకాపల్లి డీఎస్పీ శ్రావణి

**దేవరాపల్లి:** సుందర సరియా జలపాతం కొన్ని గంటలపాటు వారి వెన్నులో వణుకు పుట్టించింది. ఈ పర్యాటక ప్రాంతాన్ని చూద్దామని విశాఖ, గాజువాక, అనకాపల్లి ప్రాంతాల నుంచి వచ్చిన 32మంది సందర్శకులు ప్రాణాలు అర చేత పెట్టుకొని బిక్కుబిక్కు మని గడిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండల పరిధిలోని సరియా జలపాతం సందర్శనకు మంగళవారం ఉదయం వీరు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో భారీ వర్షం రావడంతో జలపాతానికి ముందు ఉన్న గెడ్డ ఉప్పొంగి ఉధృతంగా ప్రవహించడంతో పర్యాటకులంతా అవతలి వైపు చిక్కుకుపోయారు. విషయం తెలుసుకున్న అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తన సిబ్బందిని అప్రమత్తం చేశారు. దేవరాపల్లి, చీడికాడ ఎస్‌లు వి.సత్యనారాయణ, బి.సతీష్, అగ్నిమాపక, రెవెన్యూ అధికారులతో కలిసి మూడు గంటలపాటు శ్రమించారు. గెడ్డ ఉధృతి తగ్గిన తర్వాత రోప్ సహాయంతో ఒక్కొక్కరినీ సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. రాత్రి 10 గంటల సమయంలో దేవరాపల్లి ప్రాంతానికి తీసుకువచ్చారు. అనకాపల్లి డీఎస్పీ శ్రావణి, సీఐ పైడపునాయుడు, చీడికాడ ఎస్ఐ బి.సతీష్, అనంతగిరి, దేవరాపల్లి తహసీల్దార్‌లు వీరభద్రచారి, పి.లక్ష్మీదేవి, జీనబాడు పంచాయతీ కార్యదర్శి రమ్య వారితో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రావణి మాట్లాడుతూ వర్షాకాలంలో జలపాతాల సందర్శనలు వద్దని సూచించారు. సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన దేవరాపల్లి ఎస్ఐ సత్యనారాయణ, అగ్నిమాపక, రెవెన్యూ అధికారులను, స్థానికులను డీఎస్పీ అభినందించారు. దేవరాపల్లి చేరుకున్న పర్యాటకులకు స్థానికంగా పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి భోజన సదుపాయం కల్పించారు.

# వెంకటాపురం మాదిరిగా మాకూ నిధులివ్వాలి

- హోంమంత్రి అనితకు కూటమి నాయకుల విజ్ఞప్తి
- పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



పింఛన్ కోసం మంత్రి అనితకు వినతి పత్రం అందిస్తున్న దివ్యాంగులు

**ఎస్.రాయవరం:** ఎనిమిది వందల ఓట్లు ఉన్న వెంకటాపురం గ్రామానికి ఏడాదిలో రూ.3 కోట్లు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అదే ప్రాతిపదికన నియోజకవర్గంలో ఉన్న 108 గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించాలని తెలుగు తమ్ముళ్లు, కూటమి నాయకులు ముక్కుసూటిగా మంత్రికి విన్నవించారు. మండలంలో వెంకటాపురం గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఆమె మంగళవారం విచ్చేశారు. ముందుగా మండల కేంద్రం నుంచి వెంకటాపురం వరకు అన్నదాత సుఖీభవ విజయోత్సవ ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. ఆ ర్యాలీ ఆసక్తికరంగా లేకపోవడంతో ఎస్.రాయవరం దాటాక స్కూటీ ఎక్కి మంత్రి ప్రయాణం చేశారు. లింగరాజుపాలెం వెళ్లేసరికి స్కూటీని కూడా పక్కన పెట్టి తన వాహనంపై వెంకటాపురం చేరుకున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్, పంచాయతీ రాజ్, జెడ్పీటీసీ నిధులతో చేపట్టిన పార్క్, సీసీ, తారు రోడ్లను ఆమె ప్రారంభించారు. అనితమ్మ పేరున ఏర్పాటు చేసిన పార్కుకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభను అంగన్‌వాడీ టీచర్లు, వెలుగు సిబ్బంది, వీఓఏలు, ఆశా వర్కర్లతో నింపేశారు. ట్రాక్టర్ల ర్యాలీ కారణంగా తలెత్తిన ట్రాఫిక్‌లో కలెక్టర్ కారు చిక్కుకుపోయింది. దీంతో ప్రారంభోత్సవాలు ముగిసే సరికి కలెక్టర్ విజయ కృష్ణన్ మంత్రిని కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో రమణ, వ్యవసాయ అధికారులు ఉమా ప్రసాద్, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు. కత్రివానిపాలెం గ్రామానికి చెందిన 100 శాతం వైకల్యంతో బాధపడుతున్న చిన్నారులు మంగళవారం మంత్రికి తమ గోడును విన్నవించుకున్నారు. దిగుమర్తి కుసుమ, పోతు పల్లవి తమకు రూ.15 వేలు పింఛన్‌కు అర్హత ఉన్నా ఇవ్వడం లేదని వాపోయారు. సానుకూలంగా స్పందించిన మంత్రి రూ.15 వేలు పింఛన్ వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు.

**పేదరిక నిర్మూలనకు కృషి**

**అచ్యుతాపురం రూరల్ :** పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని హోంమంత్రి అనిత అన్నారు. మంగళవారం స్థానిక ఎంఎస్ఎంఈ కేంద్రంలో పారిశ్రామిక వేత్తలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు సరైన భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# సుంకాల ఉచ్చులో రొయ్య

## కుదేలైన ఆక్వా రంగం

- తగ్గిన రొయ్యల ఎగుమతులు
- ఇప్పటికే పతనమైన ధరలు
- భరోసా ఇవ్వని కూటమి ప్రభుత్వం





**మహారాణిపేట:** ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ ఆక్వా రంగానికి రాజసం తెచ్చిపెట్టి, విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించిపెట్టిన బంగారు రొయ్య.. నేడు అమెరికా వాణిజ్య విధానాల కారణంగా తన ఉనికినే కోల్పోయే ప్రమాదంలో పడింది. దేశ రొయ్యల ఉత్పత్తిలో అగ్రగామిగా.. ఆక్వా హబ్‌గా వెలుగొందుతున్న ఆంధ్రప్రదేశ్.. ముఖ్యంగా విశాఖ తీరం, మునుపెన్నడూ లేని సంక్షోభంలో చిక్కుకుంది. భారత ఉత్పత్తులపై అమెరికా 25 శాతం సుంకాన్ని విధించడంతో.. అంతర్జాతీయ మార్కెట్‌లో మన రొయ్యల పోటీ సామర్థ్యం దెబ్బతింది. ఫలితంగా ధరలు రికార్డు స్థాయిలో పతనం కావడం, ఎగుమతులు నిలిచిపోవడంతో లక్షలాది మంది ఆక్వా రైతులు, మత్స్యకారులు, పరిశ్రమ కార్మికుల భవిష్యత్తు అంధకారంలోకి జారుకుంది. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోకపోతే, ఈ సంక్షోభం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన, దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపడం ఖాయం.

**కుప్పకూలిన ధరలు..**

భారత రొయ్యల ఉత్పత్తులపై అమెరికా ఏకపక్షంగా 25 శాతం కస్టమ్స్ సుంకాన్ని విధించడమే ఈ సంక్షోభానికి మూల కారణం. ఇదే సమయంలో, ఈక్వెడార్ వంటి పోటీ దేశాలపై కేవలం 10 శాతం సుంకం విధించడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో భారత రొయ్యలకు డిమాండ్ తగ్గింది. ఫలితంగా ఎగుమతులు ఒక్కసారిగా నిలిచిపోయి, స్థానిక మార్కెట్‌లో ధరలు రికార్డు స్థాయిలో పతనమయ్యాయి. గతంలో 100 కౌంట్ రొయ్యల ధర రూ. 270 పలకగా, ఇప్పుడు అది రూ. 230కి పడిపోయింది. ఈ ధరల పతనంతో రైతులు టన్నుకు రూ. 50 వేల నుంచి రూ. 80 వేల వరకు నష్టపోతున్నారు. పంట చేతికొచ్చే సమయానికి ధరలు కూలిపోవడంతో, పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగిరాని పరిస్థితి నెలకొంది. ఈ దుస్థితిని ఆసరాగా చేసుకున్న స్థానిక వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వం ఆదుకోవాలి**

ఈ గండం నుంచి గట్టెక్కేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు చేపట్టాలని రైతులు, మత్స్యకారులు, పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. 'కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమెరికాతో దౌత్య, వాణిజ్యపరమైన చర్చలు జరిపి, సుంకాలను తగ్గించేలా లేదా పూర్తిగా తొలగించేలా ఒత్తిడి తీసుకురావాలి. నష్టపోయిన రైతులకు తక్షణమే ఆర్థిక ప్యాకేజీ ప్రకటించి ఆదుకోవాలి. టన్నుకు కనీస మద్దతు ధర ప్రకటించడం లేదా నష్టపరిహారం అందించడం వంటి చర్యలు చేపట్టాలి. విద్యుత్, రొయ్యల మేత వంటి కీలకమైన వాటిపై సబ్సిడీలను పెంచి, సాగు వ్యయాన్ని తగ్గించాలి. అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించి.. యూరప్, ఇతర ఆసియా దేశాల్లో కొత్త మార్కెట్లను అన్వేషించడానికి ఎగుమతిదారులకు ప్రభుత్వం ప్రోత్సాహం, సహకారం అందించాలి.'అని రైతులు కోరుతున్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే.. రాబోయే సీజన్‌లో రొయ్యల సాగుపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది పరిశ్రమ భవిష్యత్తును మరింత ప్రమాదంలోకి నెడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### పరిశ్రమపై ప్రభావం

ఈ సంక్షోభం కేవలం రైతులకే పరిమితం కాలేదు. దీని ప్రభావం మొత్తం సరఫరా గొలుసుపై పడింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 100–150 ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు, ముఖ్యంగా విశాఖ పరిసర ప్రాంతాల్లోని 15 ఫ్యాక్టరీలు ఎగుమతి ఆర్డర్లు లేక ఉత్పత్తిని భారీగా తగ్గించాయి. దీనివల్ల వేలాది మంది కార్మికులు, ముఖ్యంగా మహిళలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. రొయ్యల మేత, మందుల సరఫరాదారులు, ప్యాకేజింగ్ పరిశ్రమలు, రవాణా రంగం కూడా తీవ్రంగా నష్టపోతున్నాయి. ఏడాదికి రూ. 25వేల కోట్ల విలువైన రొయ్యలను ఎగుమతి చేసే ఈ కీలక రంగం కుదేలవడం రాష్ట్ర, దేశ ఆర్థిక వ్యవస్థకు తీరని నష్టం కలిగిస్తోంది.

## క్లుప్తంగా

### రేపు మరిడిమాంబ ఉత్సవం



అమ్మవారి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

**అనకాపల్లి:** స్థానిక గవరపాలెం నూకాంబిక ఆలయ రహదారిలో మరిడిమాంబ ఉత్సవం ఈ నెల 14న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం చెప్పారు. అమ్మవారి ఆలయం వద్ద ఉత్సవ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ 14న తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు కాండ్రేగుల నాయుడు, అధ్యక్షుడు బీఎస్‌ఎన్‌ఎల్ జోగి నాయుడు, కార్యదర్శి కాండ్రేగుల హరికిషోర్, ఉపాధ్యక్షుడు కర్రి మహాలక్ష్మినాయుడు, కోశాధికారి కాండ్రేగుల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పెంటకోట శ్రీనివాసరావు, కొణతాల బాలమురళి తదితరులు పాల్గొన్నారు.

### నేడు ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం

**అనకాపల్లి:** స్థానిక గవరపాలెం చినరామస్వామి దేవాలయం ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం ఈ నెల 13న నిర్వహిస్తున్నట్లు దేవాలయ ప్రతినిధి విల్లూరి పైడారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం పలు కార్యక్రమాలు, ధ్వజస్తంభం ప్రతిష్ట అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 14న ఆలయంలో నీరాజన మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ, వేదపారాయణ, విగ్రహ వాస్తుపూజ, హోమలు, వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

### పాడైన ఇనుప బ్రిడ్జిపై ఇబ్బందులు



పాడైన ఇనుప బ్రిడ్జిని పరిశీలిస్తున్న జాజుల రమేష్, తదితరులు

**అనకాపల్లి టౌన్:** పట్టణంలోని 83వ వార్డు మిరియాల కాలనీ వద్ద ఎల్లయ్య కాలువపై ఇనుప బ్రిడ్జి పాడైపోవడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ తెలిపారు. మంగళవారం ఆయన పార్టీ శ్రేణులతో బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్నెల్లుగా ఈ బ్రిడ్జిపై వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించకపోతే సొంత నిధులతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా బ్రిడ్జిని బాగు చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నడిశెట్టి మధు, కొమ్మున శంకర్, రెడ్డి చిన్న, లక్కోజు రాంబాబు, నడిశెట్టి గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

### బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 57 దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| మొదటి రకం | 4,950 | 4,950 |
| రెండో రకం | 3,500 | 4,000 |
| మూడో రకం | 3,250 | 3,300 |

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| రాజా | : సార్ మేడమ్ (మ్యాట్నీ, సెకండ్‌షో) |
| రాజా | : అతడు (ఫస్ట్ షో, మార్నింగ్ షో) |
| సత్యనారాయణ స్క్రీన్-1 | : కింగ్‌డమ్ |
| సత్యనారాయణ స్క్రీన్-2 | : సోమేశ్వర సులోచన |
| పర్తిసాయి | : మహావతార్ నరసింహం |
| షిర్డీసాయి | : బకాసుర రెస్టారెంట్ |
| వెంకటేశ్వర | : మాత్స |
| శ్రీ సత్య | : జూనియర్ |
| రామచంద్ర | : హరిహర వీరమల్లు |

### గ్యాస్ సమాచారం

**అనకాపల్లి:** ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 355 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 312 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

### రక్త నిల్వలు

**అనకాపల్లి:** ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 39 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6, బీ పాజిటివ్-10, ఓ పాజిటివ్-18, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

# ఆటోఇటో తేల్చుకోవాల్సిందే?

- మహిళలకు ఉచిత బస్సులతో ఉపాధికి గండి
- ఆటో సర్వీసులు లేక ఈఎంఐల భారం
- ప్రత్యామ్నాయ అవకాశం చూపని ప్రభుత్వం
- ఉన్నపళంగా రోడ్డున పడతామని ఆందోళన
- ధర్నాలకు సిద్ధమవుతున్న ఆటోవాలాలు



బేరాలు లేక స్టాండ్‌లో ఖాళీగా ఉన్న ఆటోలు

**తుమ్మపాల:** దశాబ్దాలుగా ఎటువంటి చీకూచింతా లేకుండా హాయిగా సాగిపోతున్న ఆటోవాలాల జీవనంపై కూటమి ప్రభుత్వం చావుదెబ్బ కొట్టింది. మహిళలకు ఉచిత బస్సు పేరిట స్త్రీ శక్తి పథకాన్ని ఈ నెల 15వ తేదీ నుంచి అమలుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో రోడ్డున పడతామని వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరైన భరోసా కల్పించిన తర్వాతే ఉచిత బస్సు అమలు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు పట్టించుకున్న దాఖలాలు లేవని వాపోతున్నారు. అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసిన తాము రేపటి నుంచి కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**నిరసనలకు సిద్ధమైన ఆటో కార్మికులు**

కూటమి ప్రభుత్వ హామీపై ఎన్నికలప్పటి నుంచి నిరాశ వ్యక్తం చేస్తున్నా పాలకులు ఆటో కార్మికుల సమస్యపై ఎటువంటి ప్రత్యామ్నాయ ఆలోచన చేయకుండా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అమలుకు శ్రీకారం చుట్టడంతో పలు చోట్ల నిరసనలకు సిద్ధమయ్యారు. పలు ఆటో సంఘాల నేతలు నిరసనలకు దిగేందుకు కార్యాచరణ చేపడుతున్నా రు. ఏడాదిగా ఆటో కార్మికులపై అధిక సంఖ్యలో ఫైన్‌లు వేసి వసూలు చేశారని, ఏడాదికి రూ.15 వేలు ఇవ్వడం మానేశారని, అష్టకష్టాలతో కటుంబాన్ని పోషించుకుంటూ ఆటోలను నడుపుకుంటు న్న తమను పూర్తిగా నట్టేట ముంచేశారని వాపోతున్నారు. నియోజకవర్గంలో దాదాపు ప్రతి గ్రామంలో ఆటో కార్మికులు జీవిస్తున్నారని, వారందరిని గుర్తించి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించకపోతే నిరసనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

**నియోజకవర్గంలో దాదాపు 4వేల ఆటోలు....**

జిల్లా కేంద్రమైన అనకాపల్లి పట్టణంతోపాటు మండలం, కశింకోట మండలంలో 4 వేలకు పైగా ఆటో లు నిత్యం సర్వీస్‌లో ఉంటున్నాయి. గ్రామాల నుంచి పట్టణానికి పలు రకాల కూలి పనుల నిమిత్తం వచ్చే మహిళలను తమ గ్రామాల నుంచి పని ప్రదేశానికి తరలిస్తూ అధిక సంఖ్యలో ఆటో కార్మికులు ఆధారపడి ఉన్నారు. గ్రామాల్లో చెరువు పని నుంచి ఇతర కూలి పనులకు ఆటోలను బేరాలకు పెట్టుకుని మహిళలు రాకపోకలు చేస్తున్నారు. ప్రభుత్వం ఉచిత బస్సు ప్రకటించడంతో వారంతా ఈ నెల 15 నుంచి ఆటో కార్మికులతో బేరాలను వదులుకున్నారు. ఇక నుంచి తాము బస్సుల్లోనే పని ప్రదేశానికి చేరుకుంటామంటూ ఆటోలకు షాక్‌లు ఇస్తున్నారు. దీంతో ఆటో కార్మికులు ఇప్పటి నుంచి ఖాళీ అయిపోయారు. నెలవారీ ఈఎంఐలు కట్టడం ఎలా అని లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం ఆటో కార్మికుల వివరాలు సేకరించి అర్హత ఆధారంగా ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు.

**వాహన మిత్రతో ఆదుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆటో కార్మికుల సంక్షేమానికి పెద్ద పీట వేసింది. వారి సంక్షేమానికి వాహన మిత్ర పథకం ప్రవేశ పెట్టింది. ఆటో ఉన్న ప్రతి కార్మికుడికి ఏటా రూ.10 వేలు వాహన మిత్ర కింద ఆర్థిక సహాయం చేసింది. కరోనా లాంటి కష్టకాలంలోనూ ఆదుకుంది. వరుసగా క్రమం తప్పకుండా ఆర్థిక సహాయం అందించింది. ఆటో కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపింది.

**మా బతుకులకు భరోసా ఏదీ?**



సరైన ఉపాధి అవకాశాలు లేక గ్రామాల్లోనే ఆటోలు నడుపుకుంటూ జీవిస్తున్న మమ్మిల్ని నట్టేట ముంచేలా కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు (స్త్రీ శక్తి పథకం) తీసుకొచ్చింది. కూలి పనుల కోసం నిత్యం ఇళ్ల నుంచి రాకపోకలు చేసే మహిళలను గ్రామాల నుంచి తీసుకెళ్లి పని ప్రదేశం నుంచి సాయంత్రం ఇంటికి తీసుకువచ్చే విధంగా బేరాలు ఉండేవి. ఇప్పుడు అలాంటి బేరాలను ఉచిత బస్సు ఉందంటూ రద్దు చేసుకుంటున్నారు. ప్రైవేటు బ్యాంకుల్లో రుణాలు చేసి కొన్న ఆటోలకు ఇక నుంచి నెలవారీ ఈఎంఐలు చెల్లింపులు చేపట్టే పరిస్థితి కనిపించడం లేదు. మాకు వాహనమిత్రతోపాటు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలి.

– వై.రాము, ఆటో కార్మికుడు, అనకాపల్లి

**ఆటో రుణాలను రద్దు చేయాలి**

ప్రభుత్వం ఆటో కార్మికుల కష్టాలపై విచారణ చేపట్టి బ్యాంకు రుణాలను రద్దు చేయాలి. ఏడాదికి రూ.25 వేలు వాహనమిత్ర కింద అందించి ఆదుకోవాలి. ఆటోకార్మికులకు ప్రత్యామ్నాయంగా ఉపాధి కల్పించడంపై ఆలోచన చేసి న్యాయం చేసే దిశగా అడుగులు వేయాలి. వంద శాతం సబ్సిడీ రుణాలతో ఆటోలను పంపిణీ చేయాలి. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల్లో తగ్గింపులు చేసి ఆటో కార్మికులకు అండగా నిలవాలి.

– కర్రి ధనశంకర్, ఆటో కార్మికుడు,రేబాక గ్రామం

### వినాయక నిమజ్జన స్థలం పరిశీలన



శారదానది ఒడ్డున పరిశీలిస్తున్న జెడ్సీ చక్రవర్తి, వినాయక నిమజ్జనోత్సవ కమిటీ

**అనకాపల్లి:** ఈ నెల 27న వినాయక చవితిని పురస్కరించుకుని స్థానిక శారదానదిలో 20 వేల గణపతులను నిమజ్జనం చేస్తారని వినాయక చవితి ఉత్సవాల నిమజ్జనోత్సవ కమిటీ వ్యవస్థాపకుడు ఆడారి కుమార్‌స్వామి తెలిపారు. స్థానిక శారదానది ఒడ్డున నిమజ్జన స్థలాన్ని మంగళవారం జోనల్ కమిషనర్ చక్రవర్తితో పరిశీలించారు. ఈ సందర్భంగా కుమార్ స్వామి మాట్లాడుతూ గణపతి నవరాత్రులను పురస్కరించుకుని ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 6వ తేదీ వరకూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఏటా ఇక్కడ 11 రోజులపాటు జోనల్ సిబ్బంది, పోలీస్ జోనల్ సిబ్బంది, అగ్నిమాపక శాఖ, పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తారన్నారు. రాత్రిళ్లు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నిమజ్జనోత్సవ కమిటీ, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సారె ఊరేగింపు



సారె ఊరేగింపులో పాల్గొన్న కోట్నివీధి ప్రజలు

**అనకాపల్లి టౌన్:** పట్టణంలోని కోట్నివీధి మరిడిమాంబ పండగ ఈ నెల 14న ఘనంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి సారె ఊరేగింపు వైభవంగా జరిగింది. ముందుగా మహిళలు తయారు చేసిన పిండివంటలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం సారె ఊరేగింపు కోట్నివీధి, మళ్లవీధి, పెద్దవీధి, తాకాశీవీధి, భీమునిగుమ్మం, నాయీ బ్రాహ్మణవీధి, నర్సవారి వీధి, కొణతాల వీధి, లక్ష్మీనారాయణ నగర్ తదితర ప్రాంతాల్లో సాగింది. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోట్ని పూర్ణ చంద్రరావు, తలారి లక్ష్మీప్రసాద్, కోట్ని రామకృష్ణ, నగిరెడ్డి మధు తదితరులు పాల్గొన్నారు.

## ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను తినిపిస్తున్న వైద్యాధికారిణి వాణీజగదీశ్వరి



కశింకోట బాలికల హైస్కూలులో ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్న వైస్ ఎంపీపీ జ్యోతి

**అనకాపల్లి టౌన్:** నులిపురుగులను నివారిస్తే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తుమ్మపాల వైద్యాధికారి వాణీజగదీశ్వరి పేర్కొన్నారు. మండలంలోని తుమ్మపాలలో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నులి పురుగులు ముఖ్యంగా పిల్లల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. నిత్యం పోషకాహారం భుజిస్తున్నా, ఒకటి నుంచి 19 ఏళ్లలోపు వారిలో పోషకాహార లోపం, రక్తహీనత, ఆకలి లేకపోవడం, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బలహీనత, బరువు తగ్గడం లాంటి లక్షణాలు కనిపిస్తే నులి పురుగుల ప్రభావమేనని అనుమానించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వో బి. మంగమ్మ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

**కశింకోట:** మండలంలోని తాళ్లపాలెం, కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని కళాశాలలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో బాల బాలికలకు నులి పురుగుల నివారణకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా అందజేసి మింగించారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా 17 వేల మందికి వీటిని అందజేశారు. కశింకోట పీహెచ్‌సీ పరిధిలో స్థానిక బాలికల హైస్కూలు, డీపీఎన్ జెడ్పీ హైస్కూళ్లలో పిల్లలకు వీటిని మధ్యాహ్న భోజనం అనంతరం అందించి మింగించారు. వైద్యాధికారి తిరుపతిరావు మాట్లాడుతూ నులి పురుగుల నివారణకు విద్యార్థులు వ్యక్తి గత శుభ్రత పాటించాలన్నారు. ఆహారం తీసుకునే ముందు చేతులను శుభ్రంగా కడుగుకోవాలన్నారు. కలుషిత ఆహారం తీసుకోరాదన్నారు. 10,446 మందికి మాత్రలు పంపిణీ చేశామని, మిగిలిన విద్యార్థులకు ఈ నెల 20న పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని, హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, విద్యా కమిటీ చైర్మన్లు ఆళ్ల శ్రీనివాసరావు, నక్కా నాగమణి, ఉపాధ్యాయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. తాళ్లపాలెం పీహెచ్‌సీ పరిధిలో 6,882 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో భోజనం అనంతరం ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎ. మనిషా, సుమ, కూటమి నాయకులు, ఉపాధ్యాయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 20 నుంచి ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు

పార్టీ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు



మాట్లాడుతున్న మాకిరెడ్డి రామునాయుడు

**అనకాపల్లి:** ఒంగోలులో ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకూ జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలకు జిల్లాలో పార్టీ శ్రేణులు హాజరుకావాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు కోరారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో జోనల్ మహాసభ మంగళవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలపై ధరాభారాన్ని మోపి, పన్నుల రూపంలో వసూలు చేసిన దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తుందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచిందన్నారు. ఇప్పటికే సర్దుబాటు పేరుతో చార్జీలు పెంచడం దారుణమన్నారు. విద్యుత్ శాఖ నుంచి లక్షలాది మందిని ఉద్యోగం నుంచి తొలగించాలని చూస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టాలని చెప్పిన నారా లోకేష్ ఇప్పుడు మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. రైతులకు సాగు నీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. జోనల్ కార్యదర్శి వైఎస్.భద్రం మాట్లాడుతూ ఏడాది కూటమి పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, భూ కుంభకోణాలు పెరిగిపోయాయన్నారు. అంతకుముందు పార్టీ నేత రెడ్డి రంగారావు పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు శ్రీరామదాసు అబ్బులు, రాజాన దొరబాబు, గురుబాబు, బిక్కు బాబు, డీఎస్ మూర్తి, కరణం మాణిక్యాలరావు, మొల్లేటి గోపాలరమణ, పెంటకోట ప్రసాద్, తాకాసి వెంకటేశ్వరరావు, దొడ్డి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

### పశువుల దాణా పంపిణీ

**కశింకోట:** మండలంలోని అచ్చెర్ల గ్రామంలో పాడి రైతులకు రాయితీపై సరఫరా చేసిన పశువుల సమీకృత మిశ్రమ దాణా మంగళవారం పంపిణీ చేశారు. 50 కిలోల బస్తా రూ.1,110 కాగా, రాయితీపై రూ.555కు రైతులకు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

### అనకాపల్లిలో భారీ వర్షం



పట్టణంలో కురుస్తున్న వర్షం

**అనకాపల్లి టౌన్:** పట్టణంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపడంతో ఇబ్బందులు పడిన ప్రజలు ఒక్కసారిగా కురిసిన వర్షంతో సేదతీరారు. మండల ప్రాంతాల నుంచి పట్టణానికి వివిధ పనులపై వచ్చే ప్రజలు, స్కూళ్ల నుంచి ఇంటికి వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలైన విజయరామరాజు పేట అండర్ బ్రిడ్జి జలమయమైంది.

### అంగన్‌వాడీ కేంద్రంలో వంటసామగ్రి చోరీ

**అనకాపల్లి టౌన్:** మండలంలోని వెంకుపాలెం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో వంట సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని సీడీపీవో పి.ప్రభావతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం యథావిధిగా స్కూల్ తెరిచిన తర్వాత అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న సిలిండర్లు రెండు, 32 అంగుళాల స్మార్ట్ టీవీ, ఇండక్షన్ స్టవ్, ఐదు లీటర్ల కుక్కర్, మూతలతో సహా మూడు గిన్నెలు కనిపించకుండా పోయాయన్నారు. ఈ మేరకు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.

### 15 నుంచి మహిళలకు బస్సులో ఫ్రీ టికెట్లు

- డీపీటీవో ప్రవీణ



ఆర్టీసీ, హైర్ బస్ డ్రైవర్లతో మాట్లాడుతున్న డీపీటీవో ప్రవీణ

**అనకాపల్లి :** ప్రభుత్వ ఈనెల 15 నుంచి మహిళలకు ఉచితబస్ ప్రయాణం సౌకర్యం కల్పించ డం జరిగిందని, మహిళలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్ట డం జరుగుతుందని ప్రజారవాణాశాఖ(ఆర్టీసీ) జిల్లా అధికారి వి.ప్రవీణ అన్నారు. స్థానిక ఆర్టీసీ గ్యారేజ్‌లో ఆర్టీసీ, హైర్ బస్ డ్రైవర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను డ్రైవర్లు, కండక్టర్లు తప్పని సరిగా పాటించాలన్నారు. కొన్ని రకాల గుర్తింపు కార్డులు చూపించిన మహిళలకు బస్‌లో ఫ్రీ టికెట్ ఇవ్వాలని ఆమె చెప్పారు. మహిళా ప్రయాణికుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు లేకుండా చూసుకోవాలని ఆమె కోరారు.

### కొత్త పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాలి



అనకాపల్లి డిపో వద్ద ధర్నా చేస్తున్న అసోసియేషన్ నాయకులు

**అనకాపల్లి:** ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్‌సీ కమిషన్‌ను కూటమి ప్రభుత్వం తక్షణమే ఏర్పాటు చేయాలని ప్రజారవాణాశాఖ(ఆర్టీసీ) నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రీజనల్ కార్యదర్శి పి.సుధాకర్, డిపో అధ్యక్షుడు ఎ.ఎం.రావు అన్నారు. ఈ నెల 12, 13 తేదీల్లో స్థానిక డిపో వద్ద మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు మంగళవారం ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ వేతన సవరణ అయిపోయి రెండు సంవత్సరాలు అవుతున్నప్పటికీ కొత్త పీఆర్‌సీ ఇవ్వలేదని, పీఆర్‌సీ ఇచ్చే వరకూ ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలని, గవర్నర్ పేట -2 డిపో కు చెందిన 4.15 ఎకరాల స్థలాన్ని లులు సంస్థకు బదలాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవోను తక్షణమే రద్దు చేయాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ డిపో తరలించడాన్ని ఆపాలని, పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల నాలుగు డీఏలను ఇవ్వాలని, తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డిపో కార్యదర్శి కె.ఎ స్.వి.రమేష్, కోశాధికారి ఎం.బి.రాజు పాల్గొన్నారు.

## పార్కు అభివృద్ధి చేయాలని నిరసన



నిరసన తెలియజేస్తున్న సిద్ధార్థ సోషల్ సర్వీస్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు

**అనకాపల్లి:** స్థానిక శారదానది బ్రిడ్జి వద్ద అన్నమయ్య పార్కును అభివృద్ధి చేయాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం డిమాండ్ చేశారు. మంగళవారం అన్నమయ్య పార్కు వద్ద ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాల క్రితం శారదా నది ఒడ్డున 21 అడుగుల అన్నమయ్య విగ్రహంతోపాటు సుందర వనంగా ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం పార్కులో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని వాపోయారు. పార్కును అభివృద్ధి చేసేందుకు జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని తదితర డిమాండ్లతో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వినకోట నీలేష్ గుప్తా, ఉపాధ్యక్షుడు పట్నాల కృష్ణ మోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు కొత్తుర్తి రామారావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల హక్కులను కాలరాస్తున్న జీవోలు

రద్దు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ డిమాండ్



నెహ్రూచౌక్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

**అనకాపల్లి:** ప్రత్యేక జీవోల ద్వారా కూటమి ప్రభుత్వం విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జి విమర్శించారు. స్థానిక నెహ్రూచౌక్ వద్ద ఏఐఎస్‌ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ క్రీడా మైదానం నుంచి నెహ్రూ చౌక్ వరకూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. జంక్షన్ వద్ద జెండాను ఏఐఎస్‌ఎఫ్ మాజీ నాయకులు రామానాయుడు, రాజాన దొరబాబు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ విద్యార్థుల హక్కులను కాలరాస్తున్న జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకుడు జి.గురుబాబు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రాజు, జిల్లా నాయకులు జగదీష్, సింహాద్రి పాల్గొన్నారు.

## గ్రంథాలయ పితామహుడు రంగనాథన్‌కు నివాళి



గ్రంథాలయ పితామహుడు రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**కశింకోట:** మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయ దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ రిటైర్డు అధికారులు మురళీకృష్ణ, కన్నబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.